సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం । 25 । డిసెంబర్ । 2024



కడప కేథడ్రిల్ చర్చిలో పశువుల పాకలో బాల యేసు

ఇది శుభోదయం..

కడప కల్చరల్: అరాచక పాలన జరుగుతున్న సమయంలో దేవుడు తన కుమారుడు, కరుణామయుడైన ఏసుక్రీస్తును ఈ లోకానికి పంపాడని, ఆయన లోకంలోని పాపుల రక్షణకై తన జీవితాన్ని అర్పించారని క్రైస్తవ గురువులు అన్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి క్యాథడ్రల్ చర్చిలో క్రీస్తు ఉదయించిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులు క్రీస్తు జననం గురించి మానవాళికి మహోపకారిగా మారిన విధానం గురించి బైబిల్ సూక్తులను ఉదహరిస్తూ ప్రసంగించారు. అనంతరం క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కోయర్ బృందాలు స్తుతి గీతాలు ఆలపించాయి. తొలుత చర్చిలో ఏర్పాటు చేసిన పశువుల పాకలో ఫాదర్లు, సంఘ పెద్దలతో కలిసి గురువులు బాలయేసును ఉంచి ప్రార్థనలు చేశారు. పెద్ద సంఖ్యలో విశ్వాసులు ప్రార్థనలకు హాజరయ్యారు.

రక్షకుడు ఉదయించాడు

రక్షకుడు ఉదయించాడు..
ప్రపంచ మానవాళి అశాంతితో
బాధపడుతున్న వేళ..
శాంతి సమాధానాలిచ్చేందుకు
ఆయన అరుదెంచాడు..
పాపులను కరుణించే రక్షకుడిగా
పశువుల పాకలో జన్మించాడు..
ప్రేమ, శాంతి, కరుణలను
ఇంటింటా కాంతి దీపాలుగా వెలిగించాడు..
ఆ త్యాగమూర్తి రాకను లోకం
పరవశంతో స్వాగతిస్తోంది..
నేడు క్రిస్మస్ పర్వదినం సందర్భంగా
జిల్లా అంతా పండుగ
వాతావరణం నెలకొంది.



- నేడు క్రిస్మస్ పర్వదినం
- చర్చిల్లో మొదలైన ప్రార్థనలు

కడప కల్చరల్: మెత్తగా కురుస్తున్న మంచు... ఆహ్లాదకరమైన వాతావరణం...మంద్రంగా చర్చి గంటల శబ్దాలు. ఏసయ్య రాకడను తెలుపుతూ ఇంటింటా వెలుగుతున్న క్రిస్మస్ స్టార్లు....పిల్లలకు క్రిస్మస్ తాతలు బహుమతులు ఇస్తున్న దృశ్యాలు...మనసంతా క్రీస్తుపై నిలిపి విశ్వాసులు చేస్తున్న ప్రార్థనలు..నోరూరించే కేకులు... వెరసి విశ్వాసుల్లో ఆనందం. మనసు నిండా ఉత్సాహం. క్రిస్మస్ సందర్భంగా మంగళవారం అర్ధరాత్రి నుంచే పలు చర్చిల్లో ప్రార్థనలు మొదలయ్యాయి.



కడపలో జరిగిన ర్యాలీలో శాంటాక్లాజ్ వేషధారి

తళుక్కుమన్న కాంతులు..

క్రిస్మస్ పర్వదినాన్ని నిర్వహించుకునేందుకు క్రైస్తవ లోకం సిద్ధమైంది. దాదాపు పదిరోజుల ముందు నుంచే పండుగ హడావుడి ప్రారంభమైంది. చర్చిలను నూతన రంగులతో అందంగా రూపుదిద్దారు. క్రీస్తు జననాన్ని గుర్తు చేసుకుంటూ రంగుల కాంతులు చిమ్మే క్రిస్మస్ స్టార్లను వెలిగించారు. కడప నగరంలోని కాంగ్రిగేషనల్ టౌన్‌చర్చి, మరియాపురంలోని కేథడ్రల్ చర్చి, సీఎస్ఐ సెంట్రల్ చర్చి, రైల్వేస్టేషన్ వద్దగల ఆరోగ్యమాత చర్చి, సంధ్య సర్కిల్‌లోని డాన్‌బాస్కో చర్చి, క్రైస్ట్ చర్చిలతోపాటు జిల్లాలోని జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కమలాపురం, బద్వేలు, కలసపాడు, పోరుమామిళ్ల తదితర ప్రాంతాల్లోని చర్చిలన్నీ క్రిస్మస్ పండుగ నిర్వహణకు సిద్ధమయ్యాయి.





విద్యుద్దీప వెలుగుల్లో కడప సీఎస్ఐ చర్చి

ఆనందంగా.. ఆత్మీయంగా!

- కుటుంబీకులు, బంధువులతో కలివిడిగా మాజీ సీఎం వైఎస్ జగన్
- ఇడుపులపాయలోని ఓపెన్ చర్చి వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- అంతకుముందు వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించిన మాజీ సీఎం
- ప్రజల కష్టసుఖాలు అడిగి తెలుసుకుంటూ.. అడిగిన వారికి సెల్ఫీ ఇస్తూ..
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు, కార్పొరేటర్లతో ఇష్టాగోష్టి
- వేంపల్లెలో నూతన జంటకు ఆశీర్వాదం
- పులివెందులకు వెళ్లే దారి పొడవునా రాత్రి సమయంలోనూ ప్రజల పలకరింపు



ఇడుపులపాయలోని ఓపెన్ ఎయిర్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మల్లికార్జునరెడ్డి తదితరులు

సాక్షి కడప: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలి రోజు జిల్లా పర్యటన ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. అనునిత్యం ప్రజలతో.. ప్రజా సమస్యలతో తీరికలేకుండా గడిపే జననేత వైఎస్ జగన్ క్రిస్మస్ పండుగ నేపథ్యంలో కుటుంబ సభ్యులతో కలివిడిగా తిరిగారు. సరదాగా బంధువులతో నవ్వుతూ, నవ్విస్తూ ఆనందంగా కనిపించారు. ప్రతి ఏడాది క్రిస్మస్ పండుగకు ముందురోజు ఇడుపులపాయలోని ఓపెన్ చర్చి ప్రాంగణంలో కుటుంబ సభ్యులతోపాటు బంధువులందరూ కలవడం పెద్దల కాలం నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఏటా క్రమం తప్పకుండా ఇక్కడ అందరూ కలిసి క్రిస్మస్ ముందస్తు ప్రార్థనలు నిర్వహిస్తారు. మంగళవారం చుట్టూ ప్రకృతి రమణీయతను పంచుతున్న కొండలు...ఆహ్లాదాన్ని పంచే వాతావరణం.. పచ్చని చెట్ల మధ్యన కుటుంబ సభ్యులందరూ కలిసిన క్రిస్మస్ పండుగ వేళ..ఆద్యంతం చిరునవ్వుల నడుమ.. ఒకరినొకరు పలుకరింపులు.. క్రిస్మస్ శుభాకాంక్షలు ఆత్మీయంగా గడిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్ కుటుంబీకులతోపాటు బంధువులందరూ శుభాకాంక్షలు తెలియజేస్తుండగా ఆయన కూడా అందరితో కరచాలనం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. తల్లి వైఎస్ విజయమ్మ కుమారుడు వైఎస్ జగన్‌ను ఆప్యాయంగా ముద్దాడగా, దివంగత వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ జగన్‌ను దగ్గరికి తీసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇడుపులపాయకు చేరుకోగానే నేరుగా వైఎస్సార్ సమాధి ఘాట్ ప్రాంగణానికి చేరుకున్నారు. అక్కడ ఘాట్ వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులతో మమేకం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ నేతలతోపాటు ప్రజాప్రతినిధులు, ఇతర నాయకులు ఇడుపుల పాయలో కలిశారు. ఇడుపులపాయలోని సమాధి ఘాట్ ప్రాంతంతోపాటు గెస్ట్‌హౌస్ వద్ద మాజీ ముఖ్యమంత్రిని కలిశారు. ఇక కడపకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు మాజీ సీఎంను కలిసి చర్చించారు. కడప అభివృద్ధితోపాటు పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై మాట్లాడుకున్నారు. అనంతరం ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్‌తో ఫొటోలు తీసుకున్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాజీ సీఎం పక్కనే ఉంటూ ఎక్కడికక్కడ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అన్నమయ్య జిల్లా పార్టీ అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, కడప నగర మేయర్ కె.సురేష్‌బాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర స్థాయి నాయకులు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, సింగారెడ్డి సతీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సుధీర్‌రెడ్డి, బిజేంద్రనాథరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, డీసీ గోవిందరెడ్డి, రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కడప నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్లు బండి నిత్యానందరెడ్డి, ముంతాజ్‌బేగం, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు నాగిరెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి అధినేతను కలిసిన వారిలో ఉన్నారు.

అడుగడుగునా ఆత్మీయత

ఇడుపులపాయ నుంచి వేంపల్లెకు వెళుతుండగా దారి మధ్యలో జనాలు జననేతను పలకరించారు. వేంపల్లెలోని ఎస్ఎస్ఆర్ కల్యాణ మండపంలో వేముల మండలానికి చెందిన వెన్నపూస వెంకట్రామిరెడ్డి కుమారుడు వివాహానికి వైఎస్ జగన్ హాజరయ్యారు. వధూవరులు పురుషోత్తంరెడ్డి, సాహితీరెడ్డిలను ఆశీర్వదించారు. అనంతరం అక్కడి మహిళలతో మాట్లాడారు.అనంతరం వేంపల్లె నుంచి పులివెందులకు వెళుతున్న వైఎస్ జగన్‌ను దారి మధ్యలో రాత్రిని కూడా లెక్క చేయకుండా జనాలు పలకరించారు.

ముందస్తు ప్రార్థనలు

ఇడుపులపాయలోని ఓపెన్ ఎయిర్ చర్చిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రిస్మస్ ముందస్తు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. తల్లి వైఎస్ విజయమ్మతోపాటు సతీమణి వైఎస్ భారతీరెడ్డి, కుమార్తెలు హర్ష, వర్ష అలాగే దివంగత వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ, కుమారులు వైఎస్ అనిల్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, వైఎస్ జగన్ చిన్నాన్న వైఎస్ రవీంద్రనాథ్‌రెడ్డి, వైఎస్ ఆనంద్‌రెడ్డి, దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, వైఎస్ జోసెఫ్ రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, సోదరులు, వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి, యువరాజ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.



వేంపల్లెలో వివాహ వేడుకలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్



నాన్నకు ప్రేమతో....

అక్కడ అడుగుపెడుతూనే
ఆయన కళ్లు చెమ్మగిల్లాయి..
అక్కడికి రాగానే
భావోద్వేగాలేవో కదలాడాయి..
తెలియకుండానే ఓ చేయి
తన గుండెలపై చేరింది..
మరో చేయి సమాధిని తాకింది...
మనిషిలో మౌనం..
మనసులో ధ్యానం రాజ్యమేలింది..
వైఎస్ఆర్ ఘాట్‌లో మహానేత వైఎస్సార్‌కు
నివాళి అర్పించిన క్షణంలో
జననేత వైఎస్ జగన్‌లో కనిపించిన భావాలివి.
అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా..
కోట్లాదిమంది ప్రేమా.. ఆప్యాయతలు
తనకందించిన నాన్నను
మనసారా స్మరించుకున్నారు..



కొండంత భరోసా...

నాయకుడంటే ముందుకు నడిపించాలి..
తనే కొండంత ధైర్యమివ్వాలి..
నాయకుడంటే ఓ భరోసా ఇవ్వాలి..
ఆపత్కాలంలో తనే ఓ భద్రత కావాలి.. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ ఇప్పుడదే చేసి చూపించారు.
కడప కార్పొరేటర్లతో జరిగిన సమావేశంలో వారికి ధైర్యమిచ్చారు. ఏ సమస్య వచ్చినా కలవండంటూ తమ్ముడు అవినాష్‌ను చూపిస్తూ కొండంత భరోసా ఇచ్చారు.



అభిమాన సంద్రం...

అభిమాన నాయకుడిని చూసిన ఆ క్షణం కార్యకర్తల్లో ఉత్సాహం ఉరకలేసింది.. నలువైపులా తరలివచ్చిన అభిమాన సంద్రంతో ఆ ప్రాంతం హోరెత్తింది. నాలుగు రోజుల జిల్లా పర్యటనకు వచ్చిన వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌పై అభిమానం వెల్లువలా కురిసింది. అభిమానులు, నేతలు, కార్యకర్తలు చూపించిన అభిమాన సంద్రంలో అధినేత తడిసి ముద్దయ్యారు. మరోవైపు చిరు జల్లులూ ఆయన్ను చల్లగా స్వాగతించడం విశేషం.

నేటి పర్యటన వివరాలు

పులివెందుల రూరల్: మాజీ సీఎం వైఎస్ జగన్ బుధవారం పులివెందుల, లింగాల మండలాల్లో పర్యటించనున్నారు. క్రిస్మస్ సందర్భంగా పులివెందుల సీఎస్ఐ చర్చిలో కుటుంబ సభ్యులతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.

- లింగాల మండలం తాతిరెడ్డిపల్లెలో మధ్యాహ్నం 2.30 గంటలకు రామాలయాన్ని ప్రారంభిస్తారని ఎంపీ అవినాష్ రెడ్డి తెలిపారు.

న్యూస్‌రీల్

కేంద్ర మంత్రి పర్యటన వాయిదా

కడప సెవెన్‌రోడ్స్: కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎర్త్ సైన్సెస్‌శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ జిల్లా పర్యటన వాయిదా పడిందని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుంచి మూడు రోజులపాటు సాగాల్సిన మంత్రి పర్యటన పలు కారణాలతో వాయిదా పడిందని ఆయన అందులో పేర్కొన్నారు.

ముగిసిన గుడ్ గవర్నెన్స్ వీక్

కడప సెవెన్‌రోడ్స్: సమర్థవంతమైన పాలన, సేవలను ప్రజలకు అందించడమే లక్ష్యంగా గుడ్ గవర్నెన్స్ వీక్–2024 విజయవంతంగా నిర్వహించామని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. 'ప్రశాసన్ గావోన్ కి ఓర్ 'అనే నినాదంతో గ్రామీణ ప్రజలకు సమర్థవంతమైన పరిపాలనను చేరువ చేయడం, అభివృద్ధిని గ్రామీణ స్థాయి వరకు తీసుకెళ్లడమే ప్రధాన లక్ష్యంగా 19 నుంచి 24 వరకు జిల్లాలో అన్ని మండలాలతో పాటు జిల్లా ప్రధాన కార్యాలయాల్లో గుడ్ గవర్నెన్స్ వీక్–2024 విజయవంతంగా నిర్వహించామని తెలిపారు.

27న వాలీబాల్ ఎంపికలు



కడప స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి వాలీబాల్ పురుషులు/మహిళల విభాగం ఎంపికలు ఈ నెల 27న విజయవాడ నగరంలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు వైఎస్ఆర్ జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్, నేటివిటీ సర్టిఫికెట్, 10 పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

- 27న విద్యుత్ శాఖ కార్యాలయాల ఎదుట నిరసన
- పోస్టర్లు ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం పెంచిన కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట పట్టింది. వేలకోట్లు దండుకుంటున్న కూటమి సర్కార్‌పై నిరసన స్వరం వినిపించేందుకు సమాయత్తమవుతోంది. ఈ మేరకు ఈనెల 27వ తేది అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోని విద్యుత్ శాఖ కార్యాలయాల ఎదుట వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజల తరుపున నిరసన తెలిపి, కరెంటు చార్జీలు తగ్గించాలని అధికారులకు వినతిపత్రాలు ఇవ్వనున్నారు. మంగళవారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రచార సభల్లో బాబు ష్యూరిటీ..భవిష్యత్తు గ్యారెంటీ అన్నారని, ఆరునెలల్లోనే రెండుసార్లు కరెంటు చార్జీలు పెంచి 'బాబు ష్యూరిటీ వీరబాదుడుకు గ్యారెంటీ'గా మార్చారన్నారు. ఈ చార్జీలు పెంచడం ద్వారా ప్రజలపై రూ.15,485 కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపారన్నారు. చంద్రబాబు ప్రజలను ఎలా మోసం చేస్తాడు అనే దానికి ఇదే నిదర్శనమన్నారు. ట్రూ యాప్ చార్జీలు ఎత్తివేస్తానని, చార్జీలు పెంచనని చెప్పిన చంద్రబాబు నిస్సిగ్గుగా చార్జీలు పెంచారని ధ్వజమెత్తారు. ఈనెల 27వ తేది నిర్వహించే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్, దాసరి శివప్రసాద్, శ్రీరంజన్‌రెడ్డి, జి. శ్రీనివాసులరెడ్డి, షఫీ, కార్పొరేటర్లు కె. బాబు, షఫీ తదితరులు పాల్గొన్నారు.

సోమశిల ముంపు గ్రామాల పరిశీలన



చింతువాండ్లపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న జేసీ, స్పెషల్ కలెక్టర్

అట్లూరు : సోమశిల రిజర్వాయర్ వెనుక జలాలతో ముంపునకు గురికానున్న చింతువాండ్లపల్లి, ఆకుతోటపల్లి గ్రామాలను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదితిసింగ్, భూసేకరణ స్పెషల్ కలెక్టర్ శ్రీనివాస్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 78 టీఎంసీలు కాగా ప్రస్తుతం 72 టీఎంసీలు నీరు నిల్వ ఉండటంతో.. పూర్తి స్థాయి నిల్వ చేస్తే ఎంత మేర గ్రామాలలోకి నీరు చేరుతుందని ఇంజినీరింగ్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయా గ్రామాలలోని ముంపు జలాల ద్వారా ఎదురయ్యే సమస్యలను గ్రామాల ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు త్వరితగతిన తమకు నష్ట పరిహారం అందించి పూర్తిస్థాయి నీరు నిల్వ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బద్వేలు రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రమోహన్, సోమశిల ఎస్ఈ బి.వి.రమణారెడ్డి, స్థానిక తహసీల్దారు సుబ్బలక్షుమ్మ, ఈఈ ఎం.వి. రమణారెడ్డి, డీఈ శ్రీనివాస్‌కుమార్, ఏఈలు శివప్రసాద్, యశ్వంత్, ఆర్ఐ రమణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కానిస్టేబుల్‌పై మహిళ ఫిర్యాదు

కొండాపురం : తన పట్ల అసభ్యకరంగా మాట్లాడాడని ఓ పోలీస్‌ కానిస్టేబుల్‌పై మండలంలోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ గురుకుల జూనియర్‌ కళాశాలలో సెక్యూరిటీ సూపర్‌ వైజర్‌గా పని చేస్తున్న మహిళ కొండాపురం ఎస్‌ఐకు ఫిర్యాదు చేసింది. సీఐ వాహనానికి డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్‌ ఫోన్‌లో లైగింక వేధింపులకు గురి చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ విషయంపై మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్‌ వైర్లు తగిలి డ్రైవర్‌ మృతి

పులివెందుల రూరల్‌ : మండల పరిధిలోని కనంపల్లె గ్రామ సమీపంలో దిలీప్‌ దుల్కాన్‌ కంపెనీ నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులకు సిమెంటును లారీ తీసుకెళుతుండగా.. డ్రైవర్‌ లారీ పైకి ఎక్కి పైకప్పు తీస్తుండగా.. విద్యుత్‌ తీగలు తగిలి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు జిల్లాకు చెందిన లారీ డ్రైవర్‌ వెంకటరమణ ఎర్రగుంట్ల నుంచి సిమెంటు లోడు చేసుకుని కనంపల్లె వద్ద జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనుల వద్దకు తీసుకొచ్చాడు. ఈ నేపథ్యంలో లారీ అన్‌ లోడింగ్‌ చేస్తున్న సమయంలో పైన ఉన్న విద్యుత్‌ వైర్లు తగిలి డ్రైవర్‌ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు వీరారెడ్డి 24వ వర్ధంతి

బద్వేలు అర్బన్‌ : దివంగత మాజీ మంత్రి బిజివేముల వీరారెడ్డి 24వ వర్ధంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఎస్‌బీవీఆర్‌ విద్యాసంస్థల చైర్మన్‌, మాజీ ఎమ్మెల్యే కె.వి జయమ్మ, ఎస్‌బీవీఆర్‌ విద్యాసంస్థల సెక్రటరీ, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వర్ధంతి సందర్భంగా ఉదయం 9 గంటలకు వీరారెడ్డి ఘాట్‌లో నివాళులర్పించి అనంతరం నాలుగు రోడ్ల కూడలిలోని వీరారెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించే కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. 10 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, 12 గంటలకు వర్ధంతి సభ, అన్నదాన కార్యక్రమం ఉంటుందని, వీరారెడ్డి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అలాగే వర్ధంతి సందర్భంగా వీరారెడ్డి ఛారిటబుల్‌ ట్రస్టు ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

డీ మార్ట్‌ తనిఖీ



డీ మార్ట్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు రూరల్‌ : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ రింగ్‌ రోడ్డు సమీపంలో ఉన్న డీ మార్ట్‌ను మంగళవారం కడప ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ హరిత, రూరల్‌ ఎస్‌ఐ మహ్మద్‌ రఫీ తనిఖీ చేశారు. కడపకు చెందిన శ్రీకాంత్‌, నరేంద్ర సోమవారం సాయంత్రం డీ మార్ట్‌లోని కొన్ని వస్తువుల కొనుగోలుతోపాటు పిల్లల కోసం లాల్‌ మైసూర్‌ పాక్‌ ప్యాకెట్లను కొనుగోలు చేశారు. బిల్లు చెల్లించిన అనంతరం వారు అక్కడే లాల్‌ మైసూర్‌పాక్‌ ప్యాకెట్లను తెరచి చూడగా.. అవి బూజు పట్టి ఉండటాన్ని డీ మార్ట్‌ సిబ్బందికి తెలిపారు. సిబ్బంది స్పందించకపోవడంతో వారు ప్రొద్దుటూరు మీడియాకు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంగళవారం అధికారులు తనిఖీలు చేశారు. తనిఖీలో భాగంగా వివిధ రకాల తినుబండారాలకు సంబంధించి 8 ప్యాకెట్లను వారు సీజ్‌ చేసి ల్యాబ్‌కు పంపించారు. వచ్చిన నివేదిక మేరకు చర్యలు తీసుకుంటామని ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ హరిత తెలిపారు.

జగన్మాతా.. పాహిమాం

- అంగరంగ వైభవంగా ఈశ్వరీదేవి ఆరాధనోత్సవాలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తజనం



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



ఈశ్వరీదేవికి పూజలు నిర్వహిస్తున్న మఠాధిపతి దంపతులు



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఈశ్వరీ మాత సేవా సమితి, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

బ్రహ్మంగారిమఠం : 'దేవీ శరణం.. జగన్మాతా పాహిమాం.. జగజ్జననీ రక్షమాం' అంటూ భక్తులు వేడుకున్నారు. బ్రహ్మంగారిమఠం భక్తజన సంద్రంగా మారింది. శ్రీఈశ్వరీదేవి ఆరాధన గురుపూజ మహోత్సవాలు మూడు రోజుల నుంచి ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు సజీవ సమాధి నిష్ఠ వహించిన రోజైన మంగళవారం కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అమ్మవారి మాలధారులు ఇరుముడి సమర్పించారు.

పట్టు వస్త్రాలు సమర్పణ

శ్రీఈశ్వరీదేవికి రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీఈశ్వరీ మాత సేవా సమితి ట్రస్ట్‌ చైర్‌పర్సన్‌ కమ్మరి పార్వతమ్మ నేతృత్వంలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన మహిళా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర సమర్పించారు. శ్రీ విశ్వకర్మ విరాట్‌ భవన్‌ నుంచి వారు ఊరేగింపుగా అమ్మ సన్నిధానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అంగలకుదుటి సుశీల నేతృత్వంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుజాత, ఉపాధ్యక్షురాలు రమాదేవి, కృష్ణవేణి, వజ్రాల ఇందిర, అనురాధ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన, శాంతి హోమం నిర్వహించారు. మఠాధిపతి శ్రీవీరశివకుమారస్వామి, రాజరాజేశ్వరిదేవి దంపతులు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి దువ్వూరి నరసింహాచారి, న్యాయ సలహా కమిటీ చైర్మన్‌ గురుప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

కమనీయంగా దీక్షా బంధన అలంకరణ

మధ్యాహ్నం లోకపావని దీక్షా బంధన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. అల్పాహారం, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాత్రి పండ్లతో తులాభారం నిర్వహించి, వాటిని భక్తులకు పంపిణీ చేశారు. సింహ వాహనోత్సవం ఉత్సాహభరితంగా జరిగింది. సహస్ర దీపాలంకరణ వెలుగుతో దేవస్థానం కాంతులీనింది. నెల్లూరు జిల్లా గోదాదేవి భజనమండలి, పోరుమామిళ్ల రాష్ట్ర వికాస సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటం అలరించింది. నంద్యాల జిల్లా ఉయ్యాలవాడకు చెందిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి భజన మండలి ఆధ్వర్యంలో చేపట్టిన భజన ఆకట్టుకుంది.

పోటెత్తిన భక్తజనం

ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. వారు కనులారా అమ్మవారిని దర్శించుకుని భక్తి పారవశ్యంతో మునిగిపోయారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. మఠం నిర్వాహకులు, అన్నదాన సత్రాల వారు వసతి సౌకర్యాలు కల్పించారు. ఆలయ ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో మఠం సిబ్బంది, అమ్మవారి శిష్యులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో దాతలు వొమ్మిన చిన్న ఈశ్వరయ్యశ్రేష్టి, మారంరెడ్డి రామనారాయణరెడ్డి, కడారు విశ్వనాథాచార్యులు, అంకిరెడ్డిపల్లె ఓబుల్‌రెడ్డి, కోడూరు శ్రీనివాస రావు, చెరువుపల్లి వీరయ్యస్వామి, చేవూరి రామస్వామి, తమిదల కోటిరెడ్డి, శిల్పా శ్రీకాంత్‌, కల్లూరు కేశవాచారి, కోడూరి సుబ్రహ్మణ్యాచారి, పోలు పోలేటమ్మగారి సుబ్బారెడ్డి, బాల హుస్సేన్‌రెడ్డి, కోడూరి సుబ్రహ్మణ్యాచారి, యాకశిరి జయలక్ష్మమ్మ, నొస్సం సుబ్రహ్మణ్యాచారి, మహేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

నియామకం



శ్రీపతి ఓబులేసు

కడప అర్బన్‌ : ఆంధ్రప్రదేశ్‌ జూనియర్‌ ఫారెస్ట్‌ ఆఫీసర్స్‌ అసోసియేషన్‌ కర్నూలు ఫారెస్ట్‌ సర్కిల్‌ ప్రతినిధిగా కడపలో ఎఫ్‌ఆర్‌ఓగా పని చేస్తున్న శ్రీపతి ఓబులేసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల తిరుపతిలో జరిగిన ఆంధ్రప్రదేశ్‌ జూనియర్‌ ఫారెస్ట్‌ ఆఫీసర్స్‌ అసోసియేషన్‌ స్టేట్‌ బాడీ ఎన్నికల్లో కడప అటవీ డివిజన్‌ నుంచి కర్నూలు సర్కిల్‌ రిప్రజెంటేటివ్‌గా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీపతి ఓబులేసు మాట్లాడుతూ కర్నూలు ఫారెస్ట్‌ సర్కిల్‌లోని కడప, ప్రొద్దుటూరు, నంద్యాల, కర్నూలు అటవీ డివిజన్‌లలోని ఫారెస్ట్‌ సిబ్బంది సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తామని తెలియజేశారు.

చర్చిలకు భారతి సిమెంట్స్‌ కేక్‌ల అందజేత



సీఎస్‌ఐ చర్చికి కేక్‌ను అందజేస్తున్న భారతి సిమెంట్స్‌ అధికారులు

కడప కల్చరల్‌ : క్రిస్మస్‌ను పురస్కరించుకుని భారతి సిమెంట్స్‌ అధికారులు వివిధ చర్చిలకు కేకులను అందజేశారు. మంగళవారం భారతి సిమెంట్స్‌ మేనేజర్‌ ప్రతాప్‌రెడ్డి, అధికారులు రమణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నాగేంద్ర తదితరులు కడపలోని సీఎస్‌ఐ, క్రైస్ట్‌ చర్చిలతోపాటు ఇతర ప్రముఖ చర్చిల పాస్టర్లకు కేకులను అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల జీవితాల్లో పండుగ సంతోషాలు వెల్లివిరియాలని వారు ఆకాంక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చాపాడు : మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారిలోని మండల పరిధిలో నాగులపల్లె వద్ద మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని యెంగిశెట్టి మురళీ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని వి.రాజుపాళెం గ్రామానికి చెందిన మురళీ బైక్‌లో ప్రొద్దుటూరు వెళ్లి తిరిగి చాపాడుకు వస్తుండగా.. నాగులపల్లె సమీపంలో గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మురళీ తీవ్రంగా గాయపడగా ప్రొద్దుటూరులో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు బాధితుడి కుటుంబీకులు తెలిపారు.

తేనెటీగల దాడిలో ఇద్దరికి తీవ్ర అస్వస్థత

తంబళ్లపల్లె : ఇద్దరు వ్యక్తులపై తేనెటీగలు దాడి చేయడంతో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన మంగళవారం మండలంలో జరిగింది. రేణుమాకులపల్లె పంచాయతీ చింపిరెడ్డిగారిపల్లెకు చెందిన పెద్ద మద్దయ్య (64) ద్విచక్రవాహనంలో కన్నెమడుగుకు వెళ్లారు. తిరిగి వస్తుండగా పెద్ద తేనెటీగలు దాడి చేశాయి. ద్విచక్రవాహనం నుంచి కిందపడిపోయాడు. అదే సమయానికి దిగువగాలిగుట్టపల్లెకు చెందిన జయరామిరెడ్డి అక్కడికి రావడంతో ఒక్కసారి అతన్ని తేనెటీగలు చుట్టుముట్టాయి. ఆయన కేకలు పెడుతూ కన్నెమడుగులోకి పరుగులు తీశారు. స్థానికులు అతనికి దుప్పటి కప్పి నీళ్లు చల్లినా తేనెటీగలు వెళ్లకపోవడంతో.. గడ్డిని తగలపెట్టడంతో వెళ్లిపోయాయి. బాధితులను ఆస్పత్రికి తరలించేందుకు 108 వాహనం అందుబాటులో లేదనడంతో ప్రైవేటు వాహనంలో తంబళ్లపల్లెకు తరలించారు. అక్కడి డాక్టర్లు వారికి ప్రథమ చికిత్సలు చేసి ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గణితంపై పట్టు సాధించాలి



పరీక్షల విజేతలతో డీఈఓ, ఉపాధ్యాయ సంఘం నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్‌ : విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి యు.మీనాక్షి పేర్కొన్నారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని వెంకటేశ్వర డిగ్రీకళాశాల ఆడిటోరియంలో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా.. ఆంధ్రప్రదేశ్‌ గణితఫోరం ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయిలో గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 80 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. జమ్మలమడుగు జిల్లా పరిషత్‌ హైస్కూల్‌ విద్యార్థిని జె.జ్యోతిర్మయి 87 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచి రూ.5000, ప్రొద్దుటూరు వైవీఎస్‌ మున్సిపల్‌ బాలికల హైస్కూల్‌ విద్యార్థిని దివ్యశ్రీ 84 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచి రూ.4000, రామేశ్వరం ఎస్‌సీఎస్‌ మున్సిపల్‌ హైస్కూల్‌ విద్యార్థి ఎండీ సాధిక్‌ 77 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచి రూ.3000 నగదు బహుమతి, మెమెంటో, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. వెంకట కాశీవిశ్వనాథ్‌, పురంధేశ్వరి, లాస్య, జాషిక, స్పందన, చంద్రలేఖ, హారికలు కన్సొలేషన్‌ బహుమతులు పొందారు. ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు పొందిన శైలజ, లక్ష్మీనరసమ్మలను సత్కరించారు. అలాగే గణిత ఫోరం 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, గణిత ఫోరం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నరసింహారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, రాష్ట్ర టెక్నికల్‌ కమిటీ కన్వీనర్‌ కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రొద్దుటూరు డివిజన్‌ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌ కరీం, జిల్లా కోశాధికారి సంజీవరెడ్డి, డివిజన్‌ గౌరవాధ్యక్షుడు శేషశర్మ, ప్రధానోపాధ్యాయులు, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజన్న భోజనంపై విచారణ అవసరమా?



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : రాచమల్లు రాజన్న భోజనంపై ఏసీబీ విచారణ అవసరమా అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రశ్నించారు. స్థానికంగా ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను ఎంతో మంది పేదలకు ఉచితంగా అన్నదానాన్ని రాచమల్లు రాజన్న భోజనం ద్వారా అందించానని తెలిపారు. మున్సిపల్‌ కౌన్సిల్‌లో కౌన్సిల్‌ ద్వారా మున్సిపల్‌ స్థలాన్ని అద్దెకు తీసుకున్నామన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రభుత్వానికి ఫిర్యాదు చేసి ఈ అంశంపై కూడా ఏసీబీ విచారణ చేయించాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని తీసుకుని చప్పట వేయించానన్నారు. తానేదో నేరస్తున్ని అన్నట్లు ఏసీబీ విచారణకు పురమాయించారన్నారు. పోలీసు వ్యవస్థపై తనకు సంపూర్ణ నమ్మకం ఉందని తెలిపారు. సుమారు రూ.4 కోట్లు వెచ్చించి తాను ఉచితంగా భోజనం పెట్టానన్నారు. ఎగ్జిబిషన్‌ డబ్బు కట్టని వారిపై ఎందుకు విచారణ చేయించలేకపోతున్నారని ప్రశ్నించారు. తమ హయాంలో ఉచితంగా ఎగ్జిబిషన్‌ ప్రవేశం కల్పిస్తే వరద హయాంలో రూ.150 చొప్పున వసూలు చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై న్యాయవాదుల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న న్యాయవాదులు

గాలివీడు : కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన నూతన చట్టాలను రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం గాలివీడు మండలం వెలిగల్లు ప్రాజెక్టు వద్ద ఉమ్మడి జిల్లాల న్యాయవాదుల సమావేశం జరిగింది. అనంతరం వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా భారత న్యాయవాదుల సంఘం(ఐ.అ.ఔ) ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు సి.సుబ్రమణ్యం, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ టి.ఈశ్వర్‌ మాట్లాడుతూ బ్రిటిష్‌ కాలం నాటి నేర చట్టాలు ప్రజల హక్కులు హరించే విధంగా ఉన్నాయని, వాటి స్థానంలో కొత్త నేర చట్టాలను తీసుకొచ్చి ప్రజల హక్కులను మరింత మెరుగుపరుస్తామని, సత్వర న్యాయం జరిగేట్లు చూస్తామని చెబుతున్నప్పటికీ బ్రిటీష్‌ కాలం నాటి చట్టాలే కొత్త చట్టాల కంటే మెరుగ్గా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతి ప్రసాద్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఐఏఎల్‌ నాయకులు రెడ్డయ్య, రాజకుమార్‌రాజు, ఆనంద్‌కుమార్‌, కృష్ణయ్య, చిన్నయ్య, నాగముని, ఖాదర్‌బాషా, సిద్దయ్య, హుమాయున్‌ బాషా, మహమ్మద్‌ బేగ్‌, నిరంజన్‌, హిదాయతుల్లా, బీవీ రమణ, ఆదిరెడ్డి నాయక్‌, రవిశంకర్‌, ఎస్‌ఎండీ రమణ, వరలక్ష్మి, కేఈ రమణ, ఆర్‌డీ ఆనంద్‌, ఉత్తేజ్‌ కుమార్‌, సయ్యద్‌ బాషా తదితరులు పాల్గొన్నారు.

దళితులపై విద్యుత్‌ భారం వద్దు



మాట్లాడుతున్న దళిత ఫోరం జిల్లా చైర్మన్‌ బూసిపాటి కిశోర్‌

కడప కార్పొరేషన్‌ : విద్యుత్‌ బిల్లుల బకాయిల పేరుతో దళిత, గిరిజన కాలనీలోని పేదలపై విద్యుత్‌ భారం మోపితే సహించేది లేదని దళితఫోరం జిల్లా చైర్మన్‌ బూసిపాటి కిషోర్‌ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కడప నగరంలోని దళితఫోరం కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత, గిరిజన పేదల కష్టాలు గుర్తించిన గత ప్రభుత్వాలు ఎస్సీ కాలనీలకు ఉచిత విద్యుత్‌ అందిస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్తును నేరుగార్చడమే కాకుండా బకాయిల పేరుతో వేలకు వేలు బిల్లులు వేస్తోందని మండిపడ్డారు. లక్షలు, వేలల్లో బకాయిలు చెల్లించాలనడంతో.. అంత డబ్బు కట్టలేని పేదల కరెంట్‌ కనెక్షన్లను, మీటర్లను విద్యుత్‌ సిబ్బంది నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారన్నారు. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా దళిత, గిరిజన నివాసాల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు, గిరిజనులు నిబంధనల ప్రకారం నెలకు 200 యూనిట్లలోపు వినియోగించుకున్నప్పటికీ ఉచిత విద్యుత్‌ను అందించకుండా కూటమి ప్రభుత్వం బిల్లులు జారీ చేస్తోందని, 150 యూనిట్ల లోపు విద్యుత్‌ వినియోగించుకున్న వారికి సైతం రూ.వేలల్లో పాత బకాయిలు ఉన్నాయని విద్యుత్తు సిబ్బంది కరెంట్‌ మీటర్లు తొలగించి తీసుకుపోతున్నారన్నారు. ఇటీవల సింహాద్రిపురం మండలం హిమకుంట్ల ఎస్సీ కాలనీలో గత నెలాఖరున విద్యుత్‌ అధికారులు కనెక్షన్లు తొలగించడంతో.. ఎస్సీ కాలనీ వాసులు రెండు రోజులపాటు అంధకారంలో మగ్గిపోయారని, ఈ విషయం తెలుసుకున్న ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి చొరవ చూపి బిల్లులు చెల్లించడంతో దళితవాడలో విద్యుత్తు వెలుగులు వచ్చాయన్నారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం రాఘవరాజపురంలో ఇలాంటి ఘటన చోటుచేసుకుందని, దళితవాడలో బకాయిలు చెల్లించాలంటూ విద్యుత్‌శాఖ సిబ్బంది ఇళ్ల వద్దకు రావడంతో స్థానికులు నిరసనకు దిగారన్నారు. అఖిల భారత అంబేడ్కర్‌ సేన ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు డాక్టర్‌ పెంచలయ్య పాల్గొన్నారు.

మామిడి చెట్ల నరికివేత



నరికివేతకు గురైన మామిడి చెట్లు

పెనగలూరు : మండలంలోని వెలగచర్లలో సోమవారం రాత్రి అదే గ్రామానికి చెందిన నలుగురు టీడీపీ నాయకులు 300 మామిడి చెట్లను నరికివేసినట్లు దాది శ్రీనివాసులు అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. వెలగచర్ల రెవెన్యూ పొలం సర్వే నంబరు 678లో 5 ఎకరాల పొలాన్ని నాలుగేళ్ల నుంచి సాగు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మామిడి చెట్లను మూడేళ్ల క్రితం నాటినట్లు తెలిపారు. ప్రస్తుతం మామిడి చెట్లతోపాటు అరటి చెట్లు కూడా పొలంలో ఉన్నాయన్నారు. మామిడి చెట్లను మాత్రమే నరికివేసి అరటి చెట్లను వదిలి వేశారని తెలిపారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాన్నారు. తనకు జరిగిన నష్టానికి టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తనకు బతుకు దెరువైనటువంటి మామిడి చెట్లను నరికి తనను మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు పెట్టారని ఆయన వాపోయారు.

తలకు గాయమై మహిళ మృతి

సుండుపల్లె : తలకు గాయమైన బెస్తాల నాగమునెమ్మ (50) మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని బెస్తపల్లి యల్లంపల్లికి చెందిన నాగమునెమ్మ రోజూ ఉదయాన్నే దేవాలయాలకు వెళ్లే అలవాటు ఉందని, మంగళవారం ఉదయాన్నే తిమ్మసముద్రం గ్రామంలోని ఓబులేసుని కొండకు వెళ్లేదారిలో పడిపోయి తలకు గాయమై మృతి చెందినట్లు గుర్తించామని ఆమె కుమారుడు బెస్తాల సతీష్‌ నాయుడు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నాగమునెమ్మకు గుండె జబ్బు, బీపీ వంటి అనారోగ్య సమస్యలు ఉన్నట్లు పోలీసులకు సతీష్‌ నాయుడు ఫిర్యాదు చేయడంతో, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు పేర్కొన్నారు.

డిజిటల్‌ సౌలభ్యాలను సద్వినియోగం చేసుకోవాలి

రాయచోటి టౌన్‌ : వినియోగదారులు వర్చువల్‌ విచారణలు, డిజిటల్‌ సౌలభ్యాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రఘురాం అన్నారు. మంగళవారం రాయచోటి శ్రీ సాయి ఇంజినీరింగ్‌ కళాశాలలో వినియోగదారుల దినోత్సవం -2024ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2020 నవంబర్‌ 6వ తేదీన అన్ని న్యాయస్థానాల్లో వర్చువల్‌ పద్ధతి అమలులోకి వచ్చిందన్నారు. ఈ పద్ధతి ద్వారా కూడా వినియోగదారుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్‌ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కాపాడిన వైద్యుడు

ములకలచెరువు : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో పడివున్న ఒక స్టూడెంట్‌ను అటు వైపు వెళ్తున్న ఒక ప్రభుత్వ వైద్యుడు కాపాడిన సంఘటన మంగళవారం సాయంత్రం మండలం సరిహద్దులో చోటుచేసుకుంది. మండలంలోని కోనేటివారిపల్లెకు చెందిన అనిల్‌(19) తన బైక్‌లో ఇంటికి వెళ్తుండగా ఈదుల వంక మలుపు వద్ద కదిరివైపునకు వెళ్తున్న లారీ ఢీకొట్టి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో అనిల్‌ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. బి.కొత్తకోట ప్రభుత్వ హాస్పిటల్‌లో విధులు నిర్వహిస్తున్న వెంకటరామయ్య సొంత పనుల మీద కదిరి వెళ్తుండగా స్టూడెంట్‌ను చూసి సీపీఆర్‌ చేసి కోలుకునేలా చేశాడు. అనంతరం కుటుంబ సభ్యులు 108 సాయంతో తనకల్లు ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నారు. లారీలో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

108లో ప్రసవం

నిమ్మనపల్లె : పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను ఆస్పత్రికి తరలించే క్రమంలో 108లో ప్రసవించిన ఘటన నిమ్మనపల్లె మండలంలో జరిగింది. మండలంలోని రెడ్డివారిపల్లె సమీపంలోని పౌల్ట్రీఫారమ్‌లో బీహార్‌కు చెందిన హసన్‌, ఖాతూన్‌ దంపతులు పని చేస్తున్నారు. ఖాతూన్‌కు నెలలు నిండి ప్రసవ సమయం దగ్గర పడటంతో... మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో నొప్పులు అధికం కావడంతో 108కు ఫోన్‌ చేశారు. సమాచారం అందుకున్న పైలట్‌ ఏ.ఎస్‌.సద్దాం, ఈఎంటీ రెడ్డిజస్వంత్‌తో కలిసి రెడ్డివారిపల్లెకు చేరుకుని మహిళతోపాటు ఆమె బంధువులను 108లోకి ఎక్కించుకుని నిమ్మనపల్లె పీహెచ్‌సీకి బయలుదేరారు. అయితే మార్గంమధ్యలో మహిళకు నొప్పులు అధికమవడంతో 108 వాహనంలోనే ఖాతూన్‌ పండంటి ఆడబిడ్డను ప్రసవించింది.

మోటార్ల కేబుల్‌ వైర్లు చోరీ



మోటారు వద్ద చోరీకి గురైన కేబుల్‌ వైర్లు, స్టాటర్‌ వద్ద ఎత్తుకెళ్లిన కేబుల్‌ వైరు

కొండాపురం : ఆరుగాలం శ్రమించే అన్నదాతలకు పెద్ద కష్టం వచ్చింది. వ్యవసాయ బోరు బావుల విద్యుత్‌ మోటార్లకు అమర్చిన కేబుల్‌ వైర్లను దొంగలు కట్‌ చేసి తీసుకెళ్తున్నారు. దీంతో నీటి తడులకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధి పొట్టిపాడు గ్రామంలోని వై.బాలాంజినేయులు, బి.నాగేశ్వర్‌రెడ్డి తదితరులకు చెందిన కేబుల్‌ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి దొంగలించారు. అలాగే లక్ష్మీనరసింహ దేవస్థానానికి చెందిన కేబుల్‌ వైర్లు చోరీకి గురయ్యాయి. మంగళవారం ఉదయం పొలాల్లోకి నీరు రాకపోవడంతో మోటార్ల వద్దకు వెళ్లి చూడగా కేబుల్‌ వైర్లు దొంగతనం జరిగినట్లు రైతులు తెలిపారు. పొట్టిపాడు-బెడుదూరు గ్రామాలకు వెళ్లే దారి సమీపంలోని చిత్రావతి నదిలో ఉన్న వ్యవసాయ, దేవస్థానానికి చెందిన బోరుబావుల వద్ద స్టాటర్‌ నుంచి బోరు బావుల వరకు వచ్చిన కేబుల్‌ వైర్లు చోరీకి గురయ్యాయి. ఇలాంటి ఘటనలు ఇక్కడ గతంలో కూడా జరిగాయని బాధితుతు వాపోతున్నారు. ఇకముందు పునరావృత్త కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ముంపు ప్రాంతాలపై నివేదిక పంపుతాం



జేసీకి సమస్యను వివరిస్తున్న ఆర్‌డీఓ

ఒంటిమిట్ట : సోమశిల ముంపు ప్రాంతాలపై ఉన్నత స్థాయి అధికారులకు నివేదిక పంపుతామని వైఎస్సార్‌ జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ అదితిసింగ్‌ అన్నారు. మంగళవారం ముంపు ప్రాంతాలైన మండల పరిధిలోని తప్పెటవారిపల్లె, పెన్నపేరూరు గ్రామాలను సోమశిల జలాశయ ఇంజినీరింగ్‌ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె ముంపు గ్రామస్తులతో మాట్లాడుతూ.. ఈ గ్రామాలకు సోమశిల వెనుక జలాల వల్ల కలిగే నష్టాన్ని తాను గ్రహించానని, త్వరలో జరగబోయే ఉన్నత స్థాయి అధికారుల సమావేశంలో నివేదిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎన్‌ఎస్‌ఎస్‌ స్పెషల్‌ కలెక్టర్‌ శ్రీనివాసులు, కడప ఆర్‌డీఓ జాన్‌ ఇర్విన్‌, సోమశిల జలాశయం ఎస్‌ఈ రమణారెడ్డి, ఈఈ రమణారెడ్డి, ఒంటిమిట్ట తహసీల్దార్‌ రమణమ్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.